


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 3 మే 2025

అభివృద్ధి అంటే .. చంద్రబాబు

అభివృద్ధి చేయడం అంటే చంద్రబాబును చూసి నేర్చుకోవాలని ప్రధాని మోదీ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లోనే టెక్నాలజీని అభివృద్ధి చేశారన్నారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టెక్నాలజీని పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని సైబరాబాద్ పంపానన్నారు..



భానుడు భగభగమంటున్నా.. అమరావతి పండుగకు తరలివచ్చిన వారిని చూస్తే కలల రాజధానిపై ప్రజల్లో మమకారం ఏమాత్రం తగ్గలేదని అర్థమవుతోంది. వినాశనం నుంచి వికాసం దిశగా పయనిస్తోన్న అమరావతి అభివృద్ధికి జనం జయజయధ్వానాలు .. నేతల చప్పట్ల మధ్య ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అమరావతి అత్యద్భుత అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని నేతలు ప్రతినపూనగా.. జై అమరావతి.. జైజై అమరావతి నినాదాలతో జనం హోరెత్తించారు. అమరావతి పునర్నిర్మాణ మహోత్సవాన్ని రాజధాని గ్రామాల వాసులు ఓ పండుగగా భావించగా.. రాష్ట్ర నలుమూలల నుంచి జనం జాతరకు తరలివచ్చినట్లుగా వచ్చారు. దీంతో శుక్రవారం రాజధాని గ్రామాలతో పాటు వెలగపూడి జనసంద్రంగా మారింది. నేతల నుంచి సామాన్య ప్రజల వరకు ఎవరూ ఎటువంటి ఇబ్బంది పడకుండా అధికారులు ఏర్పాట్లు చేయడంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది. అమరావతి ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో కాదని ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మూడేళ్లలో అమరావతి నిర్మాణం జరుగుతుందని.. రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ప్రధాని మోదీ తన ప్రసంగంలో చెప్పడంతో అటు నేతలు.. ఇటు ప్రజల్లో సంతోషం వెల్లివిరిసింది.

- నినదించిన జనం.. నేతలు
- హోరెత్తిన రాజధాని గ్రామాలు
- జన జాతరను తలపించిన వెలగపూడి
- పునఃనిర్మాణానికి భారీగా తరలివచ్చిన ప్రజలు
- మేళతాళాలతో రాజధాని రైతులు, మహిళల ఆహ్వానం
- మంగళగిరి నుంచి వెలగపూడి వరకూ ట్రాఫిక్ దిగ్బంధనం



..జై అమరావతి



మురిసిన రాజధాని రైతులు

నవ్యాంధ్ర రాజధాని అమరావతి కోసం భూ సమీకరణలో భూములు ఇచ్చిన రైతులు మురిసిపోయారు. గత ఐదేళ్లు అష్ట కష్టాలు పడ్డామని.. ఈ పరిస్థితుల్లో తిరిగి అమరావతికి ప్రాణం పోస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు పడిన కష్టాలను మరిచిపోయేలా అమరావతి భవిష్యత్తు కనిపిస్తోందంటూ పలువురు రైతులు, మహిళలు, కూలీలు ఆనందం వ్యక్తం చేశారు. ఇక ప్రభుత్వం కూడా సభలో అమరావతి రైతులకు పెద్దపీట వేసింది. వారికి ఏ ప్లస్ పాసులు ఇచ్చి ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేసింది. వీఐపీల మాదిరిగా వారికి ప్రత్యేక ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేసింది.

అమరావతి.. ఆకాంక్ష

వెలగపూడి సభ సాక్షిగా కలల రాజధాని అమరావతిపై అన్నివర్గాల్లోనూ అభిమానం ద్విగిణీకృతమైంది. అమరావతిని చూడాలన్న ఆకాంక్షతో రాష్ట్రం నలుమూలల నుంచి అన్ని వయస్సుల ప్రజలు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకే రాజధానికి దారితీసే మార్గాల్లో జన సందోహం కనిపించింది. ట్రాఫిక్‌లో చిక్కుకు పోయిన వివిధ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలకు సభ ముగిసిన సమయంలో కూడా ప్రాంగణానికి చేరుకుంటూనే ఉన్నారు. మహిళలు ఎండ తీవ్రతను ఏమాత్రం లెక్క చేయకుండా అమరావతికి తరలిరావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

వెల్లివిరిసిన.. జాతీయత

రాజకీయ పార్టీల జెండాలకు.. వాటి ఆనవాళ్లకు ఆస్కారం లేకుండా అమరావతి పునర్నిర్మాణ పండుగ జరిగింది. ప్రజలు కూడా మూడు రంగుల జెండాలను ప్రదర్శిస్తూ జాతీయతను చాటారు. ఇక సభ వెలుపల, సభా ప్రాంగణంలో ఎక్కడా ఏ పార్టీ జెండాల ప్రదర్శన లేకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణంలోకి కేవలం మువ్వన్నెల జాతీయ జెండాలను మాత్రమే అనుమతించారు. ప్రధాని నరేంద్ర మోదీ సభావేదిక మీదకు రాగానే ప్రజలు వందేమాతరం అంటూ జెండాలు ఊపుతూ హర్షధ్వానాలు చేస్తూ స్వాగతం పలికారు. అమరావతి రైతులు జయహో.. అమరావతి అంటూ పచ్చ కండుకావాలు గాలిలో ఊపారు. అలానే ప్రధాని హెలిప్యాడ్ మొదలు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం పొడవునా సభా ప్రాంగణం వరకు జాతీయ జెండాలతో అలంకరించారు.



తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభతో అమరావతి జనసంద్రంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ రూ.58వేల కోట్ల పనుల ప్రారంభోత్సవం చేశారు. ఈ సభ సందర్భంగా రాజధాని గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతేనంటూ జనాలు నినదించారు. స్థానిక రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా అమరావతికి మద్దతుగా నినాదాలు చేశారు. సభ జరిగే వెలగపూడితో పాటు రాజధాని పరిధిలోని అన్ని గ్రామాల్లోనే అదే వాతావరణం కనిపించింది. రాజధాని మండల కేంద్రమైన తుళ్లూరుతో పాటు పలు గ్రామాల్లో రైతులు, మహిళలు మేళతాళాలతో శుక్రవారం ఉదయం పాదయాత్ర చేస్తూ సభకు తరలిరావాలని ప్రజలను ఆహ్వానించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని ప్రాంతాలకు వందల సంఖ్యలో బస్సులు, కార్లు ముందురోజు సాయంత్రానికే చేరుకోగా ఆయా వాహనాల్లో జనం అమరావతికి తరలి వచ్చారు. వారికి ప్రత్యేకంగా భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. సభా ప్రాంగణానికి ఆలస్యం గా చేరుకున్న వీఐపీలకు అనుమతి లభించ లేదు. జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్‌అహ్మద్‌లకు వీఐపీ పాసులు ఉన్నా గ్యాలరీ నిండిపోయిందని పోలీ సులు అనుమతించలేదు. సభకు వెళ్లే మార్గాల న్నీ వాహనాలు, జనంతో నిండిపోయాయి. బస్సులు వెలగపూడి వైపు వెళ్లడానికి బారులు తీరడంతో మధ్యాహ్నానికి ట్రాఫిక్ దిగ్బంధనం ఏర్పడింది. సభకు చేరుకోవడానికి 8 మార్గాలను గుర్తించినా, ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి వచ్చే వాహనాలన్నీ మంగళగిరి వైపే వచ్చాయి. విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డును కాజ దగ్గర నుంచి వెలగపూడి సభ కోసం అనుమతించినా చాలామంది కృష్ణాయపాలెం రోడ్డు వైపే వచ్చారు. దీంతో తాడేపల్లి, మంగళగిరి వైపు నుంచి వచ్చే బస్సులన్నీ కృష్ణాయపాలెం జంక్షన్ వద్ద నుంచి ఆగిపోయాయి. ఆ జంక్షన్ నుంచి మందడం సరిహద్దుల్లోని వెస్ట్ బైపాస్ అండర్ పాజ్, ఈ-8 రోడ్డు జంక్షన్ వరకూ బస్సులు నిలిచిపోయాయి. సభానంతరం తిరిగి వెళ్లే సమయంలో కూడా అదే పరిస్థితి పునరావృతమయింది.

మధ్యాహ్నానికే కిటకిట

అమరావతి సభకు జనం పోటెత్తారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం మధ్యాహ్నం 12 గంటలకే నిండిపోయింది. ఎండ భగభగ మండుతున్నా జనం వాటిని లెక్క చేయకుం డా తరలివచ్చారు. రాజధాని సమీప జిల్లా లైన ఇటు గుంటూరు, పల్నాడు, అటు ఎన్టీఆర్ విజయవాడ, కృష్ణా జిల్లాల నుంచి భారీగా జనం తరలివస్తారని అంచనా వేయ గా అంతకుమించి జనం పోటెత్తారు. దీంతో వెలగపూడి గ్రామం జనసంద్రాన్ని తలపించింది. గ్యాలరీలన్నీ నిండిపోవడంతో ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఈ -6, 7, 8 రోడ్ల వరకు, ఎన్-9 రోడ్డు, సచివాలయం చుట్టుపక్కల రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణానికి చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటు చూసినా జనమే కనిపించారు.





అన్నిమార్గాలూ.. అమరావతి వైపే

అమరావతి పునర్నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఓ పండుగలా నిర్వహించగా.. రాజధాని సమీప జిల్లావాసులే కాకుండా రాష్ట్ర నలుమూలల నుంచి జనం పోటెత్తారు. కలల రాజధాని.. మన అమరావతి.. ఛలో అమరావతి.. జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రాజధానికి దారితీసే మార్గాలన్నీ ఉదయం నుంచే వాహనాలు, జనంతో సందడిగా మారాయి. ఇటు తాడికొండ.. అటు మంగళగిరి, తాడేపల్లి రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. అమరావతి సభకు వచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా భోజన, తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల్లో పలువురు సేద తీరారు.











హెలిప్యాడ్ వద్ద మోదీ స్వాగతం..



సభకు తరలివస్తున్న విద్యార్థినులు, మహిళలు



గ్యాలరీల బయట మహిళల సందోహం



జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

వెలగపూడిలో పార్కింగ్ స్థలంలో బస్సులు



మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకం

● రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని


వీల్ చైర్లు అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి

గుంటూరు(తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా నిలబడుతున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు. పారిశ్రామికవేత్త ఘంటా పున్నారావు సౌజన్యంతో స్థానిక స్తంభాలగరువు మహాప్రస్థానంకు వీల్‌చైర్లు సమకూర్చారు. శుక్రవారం స్థానిక బృందావన్ గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ అసోసియేషన్ కార్యాలయంలో సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నన్నపనేని పాల్గొన్నారు. వీల్‌చైర్లను నిర్వాహకులకు అందజేశారు. సంస్థ స్ఫూర్తితో జీజీహెచ్‌కు మూడు వీల్ చైర్లు అందజేస్తామని ఆమె తెలిపారు. సీనియర్ సిటిజన్స్ సర్వీస్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతయ్య, మహాప్రస్థానం ఉపాధ్యక్షుడు సుందర రామయ్య, కార్యదర్శి తాండవ కృష్ణ, మానవతా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పదవికే వన్నెతెచ్చిన మహనీయుడు డాక్టర్ కోడెల

● రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ● ప్రభుత్వ ఆసుపత్రిలో మాజీ స్పీకర్ విగ్రహావిష్కరణ


డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, ఎంపీ లావు తదితరులు

నరసరావుపేట టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏ పదవి నిర్వహించిన దానికి వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మాజీ స్పీకర్, దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ హోం మినిస్టర్ అంటే పలాన శివప్రసాదరావు అని ఈరోజు కూడా గుర్తు చేసుకునే విధంగా పనిచేశారని కొనియాడారు. స్పీకర్‌గా పనిచేసి ఆ కుర్చీకే గౌరవం తీసుకొచ్చిన మహావ్యక్తి అని ప్రశంసించారు. అసెంబ్లీలో నాడు తాను ప్రతిపక్షంలో ఉండి ఏప్పుడు మైకు అడిగినా ఇవ్వని రోజు లేదని గుర్తుచేసుకున్నారు. నేడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు మన మధ్య లేకపోవడం బాధాకరం మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి కుట్రలో భాగంగా కోడెలపై చిన్న చిన్న నిందలు వేసి ఆయనను మన మధ్యలేకుండా చేశారన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మంత్రి గొట్టిపాటి, నసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విగ్రహావిష్కరణ పూర్తి చేయాలనే నిర్ణయించుకొని కార్యక్రమం ఘనంగా నిర్వహించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంతంలో మొదటిసారిగా తెలుగుదేశం పార్టీ జెండాను ఐదుసార్లు అప్రతిహతంగా ఎగరవేయగలిగారని కొనియాడారు. ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సెప్టెంబరు 16న వినుకొండలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ అమరావతి పునఃనిర్మాణం జరిగే రోజున ఆయన నిర్మించిన ఆసుపత్రి ఆవరణలో 77వ జయంతి సందర్భంగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఆవిష్కరణ, టీడీపీ కుటుంబ సభ్యులందరూ ఇక్కడ కలుసు కోవడం సంతోషంగా ఉందన్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో పల్నాడు ప్రాంతానికి ఒక గౌరవాన్ని తెచ్చిన మహానాయకుడు డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు. టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, లలిత్‌సాగర్, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఆసుపత్రి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటిటి శ్రీధర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, కుమ్మెత కోటిరెడ్డి, గంగుల పెద్దిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, కొండ్రుగుంట లక్ష్మి, డాక్టర్ పూరేటి భారతి తదితరులు పాల్గొన్నారు.

రేపు నీట్‌కు ఏర్పాట్లు పూర్తి

● ఉమ్మడి జిల్లాలో 16 కేంద్రాలు, 4,250 మంది విద్యార్థులు

గుంటూరు (విద్య) మే 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో ఎన్‌టీఏ నిర్వహించే (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్)నీట్ ఆదివారం జరగనుంది. పరీక్ష కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్‌టీఏ మొత్తం 16 కేంద్రాలు ఏర్పాటు చేసింది. 4,250 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షకు విస్తృత భద్రత ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు డ్రెస్ కోడ్ పాటించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే నిబంధనలతో కూడిన సమాచారాన్ని పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తెలియజేశారు. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా ఉదయం 11 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 514.10 అడుగులు ఉంది. ఇది 138.73 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో 1,350 క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎడ్ల పందేలు సంస్కృతిలో భాగం: మంత్రి సత్యకుమార్ యాదవ్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మే, 2 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు నిర్వహించడం సంస్కృతి సాంప్రదాయాల్లో భాగంగా వస్తుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బలప్రదర్శన పోటీలకు శుక్రవారం రెండవ రోజు మంత్రి సత్యకుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలిరోజు టచ్‌పళ్ల విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం డ్ల పందేలను ప్రారంభించి, జతల యజమానులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ మన జీవన విధానంలో పశువులను కుటుంబ సభ్యులుగా చూస్తామని పేర్కొన్నారు. నేటి యాంత్రిక జీవితంలో ఆటవిడుపుగా ఇలాంటి పోటీలకు వచ్చి ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగ వాతావరణంలో 8రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను తాను ఊహించలేదన్నారు. రాయలసీమ ప్రాంతం నుంచి వచ్చిన తాను తన జీవితంలో ఇంత పెద్దస్థాయి పందేలను మొదటిసారిగా చూస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదర్శ ప్రజానాయకుడు అని కొనియాడారు. ఆరు సార్లు గెలుపొందడమంటే ఎలా విజయం సాధించవచ్చో నరేంద్రకుమార్‌ను చేసి నేర్చుకుంటున్నామన్నారు. రెండు పళ్ల విభాగంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 24 జతల ఎడ్లు 800కిలోల బండను లాగి పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి.

మారనున్న అమరావతి రూపురేఖలు: ప్రత్తిపాటి


ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃనిర్మాణం నవ్యాంధ్ర ప్రగతికి దోహదపడే సరికొత్త ప్రయాణం అని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం అన్నారు. ఆంధ్రమాత గర్వించేలా, భరతమాత మురిసేలా జోరుగా ప్రజా రాజధాని నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రానికే తలమానికమైన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ ఘట్టం ప్రధాని మోదీ చేతుల మీదుగా జరగడం తెలుగు ప్రజలకు కనివినీ ఎరుగని గొప్ప సంబరంగా నిలిచిందన్నారు. ఇక అమరావతిలో పనుల జోరు పెరిగి, రాష్ట్రానికి మరిన్ని కొత్త పరిశ్రమలు, పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల దుష్ట, స్వార్థ రాజకీయాలకు బలైన అమరావతి కూటమి ప్రభుత్వ రాకతో, ప్రధాని మోదీ అండతో బతికి బంగారు బాటపట్టిందని వివరించారు. వచ్చే మూడేళ్లలో అమరావతి రూపురేఖలు పూర్తిగా మారిపోయి ఆంధ్ర ప్రజల రాజధాని కలలు సాకారమవుతాయని ఆకాంక్షించారు. అమరావతి శ్మశానమని, ఎడారని, కేవలం ఒక వర్గానికే పరిమితమని వైసీపీ ప్రభుత్వం చిమ్మిన విద్వేషం, నిర్మాణ పనుల్లో చేసిన విధ్వంసం అంతా ఇంతాకాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ దొంగలు చివరకు నిర్మాణ సామగ్రిని, రోడ్లను కూడా తవ్వేసి అమ్ముకునేంతలా దిగజారారని విమర్శించారు. చంద్రబాబు ప్రారంభించిన అమరావతి పనులు కొనసాగిస్తే, తనకు ఒరిగేదేమీ ఉండదనే సంకుచిత బుద్ధితో జగన్మోహన్ రెడ్డి మూడుముక్కలాట ఆడి, ప్రజల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రేపి, పబ్బం గడుపుకునే ప్రయత్నం చేశాడని పేర్కొన్నారు. చంద్రబాబు పిలుపుతో రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల్ని నిర్దాక్షిణ్యంగా హింసించాడని అన్నారు. జగన్ దౌర్జన్యాలు, దాష్టీకాలు, దమనకాండను తట్టుకొని మొక్కవోని దీక్షతో 1,631రోజుల పాటు రైతులు, మహిళలు చేసిన పోరాటం దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిందని అన్నారు. ప్రధాని మోదీ సాక్షిగా జరిగిన రాజధాని బహిరంగసభ అమరావతి రైతుల ఆనందభాష్పాలు, భావోద్వేగాలతో పులకించిందని అన్నారు.

రైల్వే పనుల్లో నాణ్యత పాటించాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌తో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని

గుంటూరు (తూర్పు), మే 2(ఆంధ్రజ్యోతి): గతి శక్తి పథకం కింద జరుగుతున్న ఆర్‌వోబీ, అమృత్ భారత్ కింద జరుగుతున్న రైల్వే స్టేషన్ పనులు పూర్తిస్థాయి నాణ్యతతో ప్రజలకు అందించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు రీజినల్ డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. పెమ్మసాని మాట్లాడుతూ గతి శక్తి పథకం కింద జరుగుతున్న ఇన్నర్ రింగ్ రోడ్, పెదపలకలూరు, అలాగే అసంపూర్తిగా ఆగిన నందివెలుగు ఆర్‌వోబీ తదితర వంతెనల పనులను త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. అమృత్ భారత్ కింద గుంటూరులో జరిగే రైల్వే స్టేషన్ పనులను గతంలో తాను పరిశీలించానని, అవి నాసిరకంగా కనిపించాయని చెప్పారు. సుధేష్ణ సేన్ మాట్లాడుతూ ఉత్తర భారత దేశం మాదిరిగా ఆర్‌వోబీలపై షెడ్లు (రూఫ్ టాప్) ఏర్పాటు చేయాలని, దీంతో వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. రైల్వే క్రాసింగ్ వద్ద వాహనాల ప్రమాదాలను, పశువుల రాకపోకలు నివారించి ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరారు.

సిబ్బంది కొరతతో 8 రైళ్ల రద్దు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): రైల్వే సిబ్బంది గ్రూపు-బీ పరీక్షకు హాజరు కానుండడంతో ఎనిమిది రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో (57201) విజయవాడ- గుంటూరు, (57203) గుంటూరు- మాచర్ల, (57206) మాచర్ల- నడి కుడి, (57205) నడికుడి -మాచర్ల, (57204) మాచర్ల - గుంటూరు, (57202) గుంటూరు- విజయవాడ రైళ్లను, 4, 5 తేదీల్లో (67779) కాచీగూడ- నడికుడి, (67780) నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేసినట్లు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్ శుక్రవారం తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 145, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

67,379 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 65,069 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 67,379 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 40,246 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13700
334	9500	13200	షార్క్-1	----	----
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	----	----	సింజెంటా బ్యాడిగి 5531	---	---
341	10000	13300	దేవనూరుడీలక్స్	10000	12600
4884	10000	11200	ఆర్మూరు	9800	11200
సూపర్10	10000	12300	తాలుకాయలు	4500	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					

అమరావతి సభకు చేరకుండానే..

ఎన్‌హెచ్-16 టోల్ ప్లాజా వద్ద భారీగా ట్రాఫిక్ జామ్


కాజ టోల్ ప్లాజా వద్ద ఆగిన బస్సులు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునఃప్రారంభ బహిరంగ సభకు.. ఎన్నో ప్రయాసలకోర్చి వచ్చిన వేలాది మంది ప్రజలు చేరుకోలేకపోయారు. ముఖ్యంగా ఎన్‌హెచ్-16 చెన్నై - కోల్‌కత్తా జాతీయ రహదారి మీదగా వచ్చిన వాహనాలు కాజా టోల్ ప్లాజా వద్ద వేలాది సంఖ్యలో నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేటు వాహనాలు దాదాపుగా ఐదు కిలోమీటర్ల పొడవునా బారులుదీరాయి. అలానే మంగళగిరి నియోజకవర్గంలో డాన్ బాస్కో స్కూలు నుంచి యర్రబాలెం, కృష్ణాయపాలెం వరకు ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. హైవే మీద వాహనాలు సులభతరంగా సభా స్థలికి చేరుకొం టాయని అంతా భావించారు. అయితే అందుకు విరుద్ధంగా చిన్న రోడ్లలో వచ్చిన వాహనాలు ప్రాంగణం వద్దకు సులభ తరంగా చేరుకొన్నాయి. ఇక్కడ పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. రాయ లసీమ, పల్నాడు వైపు నుంచి వచ్చిన వాహనాలకు అమరావతి మీదగా రూట్ ఇచ్చారు. ఈ మార్గంలోనూ ట్రాఫిక్ స్తంభించిపోవడంతో చాలామంది మహిళలు బస్సుల్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. వాళ్లలో చాలామంది సభ వద్దకు రాకుండానే వెనుదిరిగారు. దాంతో మహిళలు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు.

తెరుచుకున్న విజయవాడ వెస్టు బైపాసు

ప్రధాని సభ దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకూడదని విజయవాడ వెస్టు బైపాసు రోడ్డుని తాత్కాలికంగా తెరిచారు. దీంతో ఎన్‌హెచ్-16లో చినకాకాని వెంకటపాలెం వద్ద సర్వీసు రోడ్డు నుంచి సీడ్‌యాక్సిస్ రోడ్డుకు వాహనాలను మళ్లించారు. అలానే విజయవాడ వైపు నుంచి వచ్చే వాహనాలను సూరాయపాలెం నుంచి కృష్ణానది వంతెన మీదగా సీడ్ యాక్సెస్ రోడ్డులోకి అనుమతించారు. దీంతో ఎక్కువ సంఖ్యలో వాహనాలు ప్రధాని రాక ముందే సభాస్థలి వద్దకు చేరుకొన్నాయి.

పోలీసుల ఓవరాక్షన్

ప్రధాని సభ సందర్భంగా పోలీసులు చాలా చోట్ల అతిగా ప్రవర్తించారు. కొంతమంది వీవీఐపీలు, వీఐపీలను కూడా వారికి కేటాయించిన గ్యాలరీల్లోకి అనుమతించలేదు. దీంతో వారంతా అసంతృప్తి వ్యక్తం చేశారు. తగిన పాస్‌లతో వచ్చినా వాహనాలను.. వారికి కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోకి అనుమతించకుండా బస్సులు పార్కింగ్ చేసిన ప్రాంతానికి మళ్లించారు. దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలానే బహిరంగ సభ జరిగిన ప్రదేశంలో దాదాపుగా లక్ష కుర్చీల వరకు వేశారు. తొలుత ఆ గ్యాలరీల్లోకి అనుమతించకుండా స్టాండ్‌బై వేదికకు ఎదురుగా సిద్ధం చేసిన ప్రాంగణంలోకి ప్రజలను తరలించి, కింద కూర్చోబెట్టారు. అక్కడ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి వాటిల్లోనే సభ చూడాలన్నారు. తాము ఇంత ప్రయాస పడి వచ్చింది సభని ఎల్‌ఈడీ తెరల్లో చూడటానికా అని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్యాలరీల్లోకి అనుమతించకుండా అడ్డుకోవడం పైనా పోలీసుల తీరును తప్పుబట్టారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన అగ్నిప్రమాదం


కమ్ముకున్న నల్లటి దట్టమైన పొగ

తుళ్లూరు (మందడం) మే2(ఆంధ్రజ్యోతి): మందడం దగ్గరిలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం ఓ ఏజెన్సీ కంపెనీ గతంలో నిల్వ చేసి ఉంచిన ప్లాస్టిక్ పైపుల గుట్టకు నిప్పు అంటుకుంది. మంటలు ఎగసి పడటం, నల్లటి దట్టమైన పొగ కమ్ముకోవడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. ప్రధాని సభ జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో అప్రమత్తమయ్యారు. దాదాపు గంటన్నర పాటు మంటలు చెలరేగుతూ నల్లటి పొగ కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా ఇలా చేశారు.. లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాని సభ జరిగే ప్రదేశానికి ఈ ప్రాంతం ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

రెండో అదనపు సివిల్ జడ్జిగా సుజన్‌కుమార్

సత్తెనపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో అదనపు సివిల్ కోర్టు జడ్జిగా సుజన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతపురం నుంచి బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

అమరావతి పునర్నిర్మాణ సభకు తరలిన జనం

● ఏర్పాట్లను పర్యవేక్షించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
● బస్సులను ప్రారంభించిన స్థానిక నాయకులు


అమరావతి: బస్సులో వెళ్తున్న కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రవీణ్


పెదకూరపాడు నుంచి బయలుదేరిన బస్సులతో పార్టీ శ్రేణులు


అచ్చంపేటలో బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తదితరులు

పెదకూరపాడు నియోజకవర్గం నుంచి..

పెదకూరపాడు, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనుల శంకుస్థాపనకు ప్రధానమంత్రి మోదీ సభకు పెదకూరపాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచనలతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో తరలివెళ్ళారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లి పలు నియోజకవర్గాలకు చెందిన వందలాది బస్సుల్లో, కార్లలో పెదకూరపాడు మీదుగా రాజధానిలో జరిగిన మోదీ సభకు తరలివెళ్ళారు. పెదకూరపాడులో మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు గల్లా బాబూరావు, బెల్లంకొండ రామగోపాలరావు, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, షేక్ ముంతాజ్, పలువురు పార్టీ శ్రేణులు బస్సులను జెండాలు ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాటర్ బాటిల్స్, భోజనాన్ని పంపిణీ చేశారు. ప్రధాని మోదీ సభకు పెదకూరపాడు నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు తరలిరావటంపై ఎమ్మెల్యే ప్రవీణ్ కృతజ్ఞతలు తెలిపారు.

అచ్చంపేట మండలం..

అచ్చంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం నుంచి రాజధానిలో శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్ళారు. ప్రతి గ్రామం నుంచి 3 బస్సులకు తగ్గకుండా ప్రజలు వెళ్ళగా అచ్చంపేట నుంచి 12 బస్సుల ద్వారా సభకు వెళ్ళారు. సుమారు 10వేల మంది ఉండవచ్చని టీడీపీ నాయకులు తెలిపారు. బస్సులకే కాకుండా ద్విచక్ర వాహనాలు, కార్ల ద్వారా కూడా ఈ సభకు వెళ్ళారు. కార్యక్రమంలో టీడీపీ మండల అ ధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగండ్ల కోట య్య, ముక్కపాటి గిరిబాబు, తిరువాయిపాటి ఆంజనేయులు, నల్లగట్ల సత్యం, రాయిడి సాంబశివుడు, కోట చంటి, బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి మండలం..

అమరావతి, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నేతృత్వంలో మండల పరిధి గ్రామాల నుండి కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు భారీగా తరలివెళ్లారు. మండలం నుండి సుమారు 90బస్సులు, ప్రత్యేక వాహనాలలో వేలాదిగా తరలివెళ్లారు. బస్సులను ప్రవీణ్ జండా ఊపి ప్రారంభించారు. పెదమద్దూరు రోడ్‌లో సుందరయ్యనగర్ బి.నగేష్ మిత్రబృందం ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

క్రోసూరు మండలం..

క్రోసూరు, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు పెదకూరపాడు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున కూటమి శ్రేణులు తరలివెళ్ళారు. వందలాది బస్సులు, బైక్‌లు, కార్లలో సుమారు 40వేల మంది వరకు నియోజకవర్గం నుంచి తరలివెళ్ళినట్టుగా అంచనా. వాహనశ్రేణిని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. క్రోసూరు మండలం నుంచే వంద ఆర్టీసీ బస్సులు, 20 ప్రైవేటు బస్సులు, సుమారు 150కార్లు, వందలాది మోటారు బైక్‌లపై తరలివెళ్ళారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, స్వయంసహాయ గ్రూపు మహిళలకు, ప్రజలకు భోజనం, అల్పాహార సదుపాయం ఎమ్మెల్యే ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. పోలీసులు శాంతిభద్రతలు పర్యవేక్షించారు.

బెల్లంకొండ మండలం..

బెల్లంకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు శుక్రవారం బెల్లంకొండ మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు భారీగా తరలివెళ్ళారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్‌షరీఫ్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. నాగిరెడ్డిపాలెం నుంచి మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు తరలివెళ్ళారు. న్యూచిట్యాల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ నుంచి హనుమంతరావు నాయక్, మన్నె సుల్తాన్‌పాలెం నుంచి టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, మాచాయపాలెం నుంచి గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో భారీగా సభకు తరలివెళ్ళారు. బెల్లంకొండ మండలం నుంచి సుమారుగా 5 వేల మంది తరలివెళ్ళినట్టు పార్టీశ్రేణులు తెలిపాయి.

సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి...


రాజుపాలెం: బస్సులను ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు


ముప్పాళ్ల: మధుబాబు ఆధ్వర్యంలో తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు, ప్రజలు

సత్తెనపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ నాయకత్వంలో నియోజకవర్గ కూటమి నేతలు, నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలో వివిధ వాహనాల్లో తరలి వెళ్ళారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఇతర అధికారులు అమరావతికి వెళ్ళే ప్రజానీకానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లుచేశారు. ఆయా గ్రామాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు ఉత్సాహంగా అమరావతికి తరలివెళ్ళారు. ఆయా మండలాల నేతలు ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, పల్లపాటి పెద్దిరాజు, నాగోతు శౌరయ్య, ఎలినేడి రామస్వామి, కనుమూరి బాజీచౌదరి తదితర కూటమి నేతల సారథ్యంలో అమరావతి తరలివెళ్ళారు.

రాజుపాలెం మండలం..

రాజుపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణపనులకు పునఃశంకుస్థాపనకు రాజుపాలెం మండలం నుండి భారీగా ప్రజలు తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుండి అధికసంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. మహిళలు ఎక్కువసంఖ్యలో వెళ్లటం సంతోషదాయకమని టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు అన్నారు.

నకరికల్లు మండలం..

నకరికల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు తరలి వెళ్ళారు. నకరికల్లు మండలానికి 20 బస్సులను కేటాయించారు. మండల ప్రత్యేక అధికారి పీ రూఫస్‌రాణి, ఎంపీడీవో జీ కాశయ్య జెండా ఊపి ప్రారంభించారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు, జనసే, బీజేపీ నాయకులు ప్రజలను సభకు తరలించారు.

ముప్పాళ్ల మండలం..

ముప్పాళ్ళ మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణ పునఃప్రారంభ సభకు ముప్పాళ్ళ మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాజీ ఉప ఎంపీపీ రావిపాటి మధుబాబు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం అధిక సంఖ్యలో తరలివెళ్ళారు. బస్సుల ద్వారా సుమారు 3వేల మందికి పైగా ప్రధాని సభకు తరలివెళ్ళారు.

పిడుగురాళ్ల నియోజకవర్గం...


పిడుగురాళ్ల: చినఅగ్రహారం నుంచి సభకు వెళ్తున్న మహిళలు


మాచవరం: వేమవరం నుంచి తరలివెళ్తున్న డ్వాక్రా మహిళలు, కూటమి నాయకులు, అధికారులు


దాచేపల్లి: సభకు తరలివెళ్తున్న కూటమి నాయకులు, మహిళలు

పిడుగురాళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ సభకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కూటమినేతలు, మహిళలు, యువత భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని 4మండలాల నుండి, పట్టణాల నుండి ప్రత్యేక బస్సుల్లోనే కాకుండా కూటమి నేతలు సొంత వాహనాలలో మహాసభకు తరలివెళ్లారు. పిడుగురాళ్లలో వారికి అల్పాహారం, మంచినీటి ప్యాకెట్లను పార్టీ శ్రేణులు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ పి శ్రీధర్, డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాఘవేంద్ర, ఎంపీడీవో రామచంద్రరావు అందజేశారు.

● మాచవరం, మే 2(ఆంధ్రజ్యోతి): మాచవరం మండలంలోని అన్ని గ్రామాల నుంచి కూటమి నేతలు, అధికారులు, డ్వాక్రా మహిళలు శుక్రవారం భారీ సంఖ్యలో అమరావతి తరలివెళ్ళారు.12 ఆర్టీసీబస్సుల్లో తరలివెళ్ళారు. కూటమినేతలు సొంత వాహనాల్లో కూడా భారీగా తరలివెళ్ళారు. కొత్తపాలెం గ్రామం నుంచి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కోయ రజిని ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు భారీ సంఖ్యలో తరలివెళ్ళారు.

● దాచేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మోదీ సభకు మండలం నుంచి వేలాదిమంది మహిళలు, కార్యకర్తలు, నాయకులు తరలివెళ్ళారు.ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వాహనాలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో కూటమినేతలు, నాయకులు తరలివెళ్ళారు. ఆయా కార్యక్రమాల్లో తంగెళ్ళ శ్రీనివాసరావు, బద్రి, అక్కినపల్లి బాలయ్య, పగడాల భాస్కరరావు, నర్ర పుల్లయ్య, సొసైటీ నారాయణ, వేముల తిరుమల కుమార్, ముస్కం శ్రీనివాసరావు, నెల్లూరి రామ కోటయ్య, వేముల వినోద్‌రెడ్డి, పురంశెట్టి పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల నియోజకవర్గం ...


గురజాల నుంచి అమరావతికి తరలివెళ్తున్న కూటమి నేతలు


విజయపురిసౌత్ నుంచి అమరావతికి తరలివెళ్తున్న నేతలు


మాచర్ల నుంచి అమరావతికి తరలివెళ్తున్న నేతలు, కార్యకర్తలు

మాచర్లటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ ప్రారంభోత్సవానికి శుక్రవారం మాచర్ల నియోజకవర్గం నుంచి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, నేతలు భారీగా తరలివెళ్లారు. మాచర్ల నియోజకవర్గం నుంచి మొత్తం 64 బస్సులు తరలివెళ్లాయి. పట్టణం నుంచి 12 ప్రత్యేక బస్సులు, మాచర్ల రూరల్ 12, వెల్దుర్తి 10, కారంపూడి 10, దుర్గి 10, రెంటచింతల నుంచి 10 బస్సులు అమరావతికి వెళ్లాయి. ఇవేకాకుండా మరో 50 ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కూటమినేతలు, కార్యకర్తలు, అభిమానులు, డ్వాక్రా మహిళలు తరలివెళ్లారు. అధికారులు పర్యవేక్షించారు. వీరిలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పట్టణ సీఐ పి.ప్రభాకరరావు, కమిషనర్ దూళిపాళ్ల వేణుబాబు, రాజశేఖర్ ఉన్నారు.

● మాచర్ల రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): అమరామవతి రాజధాని పునఃప్రారంభోత్సవానికి మండలంలోని పలు గ్రామాల నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వందలాదిగా అమరావతికి వెళ్లారు. ముందుగా ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తూ జై అమరావతి, జై చంద్రబాబు అంటూ నినాదాలు చేస్తూ కోలాహలం చేశారు. అలాగే మండలంలోని విజయపురిసౌత్ నుంచి కూటమి నేతలు, కార్యకర్తలు భారీగా అమరావతికి పలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విజయపురి సౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లుచౌదరి, ఆడెపు కోటయ్య, సత్తిబాబు, డాక్టర్ బసివిరెడ్డి, కట్టా రాజు, గంటా ధనుంజయరావు, చంద్రశేఖర్, సీహెచ్ అప్పలరాజు, అప్పలనర్స, జనసేన కార్యదర్శి చరణ్, రామ్‌చంద్, అప్పలరాజు, ఊరే మార్కు, పండు, నాగయ్య, కాశీ, గంగుబాబు, హాతీరామ్, యాకోబు పాల్గొన్నారు.

గురజాల మండలం..

గురజాలటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ వేడుకలకు ప్రధాని మోదీ వస్తుండడంతో శుక్రవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన వేలాది కూటమి నేతలు అమరావతికి తరలివెళ్లారు. మండలం నుంచి సుమారు 20 బస్సుల్లో కూటమి నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భారీగా అమరావతి వెళ్లారు.

కారంపూడి మండలం...

కారంపూడి మండలం నుంచి ఎమ్మెల్యే జూలకటి బ్రహ్మానందరెడ్డి నాయకత్వంలో కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భారీగా శుక్రవారం అమరావతి పునర్నిర్మాణ వేడుకలకు తరలివెళ్లారు. బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వందలాదిగా అమరావతికి చేరుకున్నారు. తరలివెళ్లిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, పట్టణ మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్ జాని, షేక్ నన్నేసా, జానీబాషా, బొల్నేడి హరికృష్ణ, దోర్నాల నాగిరెడ్డి, చావా వీరాంజనేయులు, నాగులనాయక్, సరస్వతి బాలునాయక్, బీసీ సెల్ జిల్లా కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు తుపాకుల చినరత్తయ్య, బొల్నేడి కోటేశ్వరరావు, బీసీ సెల్ నేత లింగాల శ్రీనివాసరావు, కర్లా అమరసైదారావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శెట్టి హనుమంతురావు, కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కజ్జం పెద ఆంజనేయులు, తెలుగు మహిళా నేత నాగలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల మండలం..

రెంటచింతల, మే 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు భారీగా తరలివెళ్లారు. అలాగే అధికారులు కూడా వేకువజామునుంచే కింది స్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ 10 ఆర్టీసీ బస్సులు, కార్లలో బయలుదేరారు. ప్రతి బస్సుకు ప్రభుత్వ ఉద్యోగులను కేటాయించారు. సభకు వెళ్లిన వారందరికి అన్నపానీయాలు ఏర్పాటు చేశారు. ఈ సభకు తరలివెళ్లిన వారిలో ఎంపీడీవో కె.సరోజనిదేవి, ఏఈ శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శౌంరిరెడ్డి నాగమ్మ నర్సిరెడ్డి, టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, రాయపరెడ్డి, బోడపాటి రామకృష్ణ, తుమ్మా జోజిరెడ్డి, సిద్దయ్య, కోటేశ్వరరావు, జ్ఞానయ్య, దానయ్య, పెద సామ్యేల్, బ్రహ్మారెడ్డి, షేక్ బుజ్జి, జి.శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

మసీదు నిర్మాణానికి యరపతినేని సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6వ వార్డులో నిర్మాణంలో వున్న హతియా ఫాతిమా మసీదుకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని మసీదు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ మైనారిటీల అభివృద్ధికి తనవంతు పాటుపడతానని, నియోజకవర్గంలో మసీదులు, షాదీఖానాలు, ఈద్గాల నిర్మాణం టీడీపీ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు.


రాజధాని పునర్నిర్మాణ సభలో పాల్గొన్న ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 2(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 23.64 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 3,700 క్యూసెక్కుల నీరు, లీకుల ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం 4వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

రిపోర్టుల పేరుతో సెలవుల్లోనూ ఒత్తిడి

పెదకూరపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లోనూ విద్యాశాఖ అధికారులు రిపోర్టుల పేరుతో తమను ఒత్తిడికి, మానసిక వేదనకు గురిచేస్తున్నారని నియోజకవర్గ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నోముల కోటేశ్వరరావు తెలిపారు. శనివారం పెదకూరపాడులో ఎంఈవో ఏకుల ప్రసాదరావును కలసి ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు వినతిపత్రాన్ని అందించారు. వచ్చే విద్యా సంవత్సరానికి ఉపాధ్యాయులు పాఠశాల అవసరాలను సమకూర్చుకొనే సందర్భంలో వార్షిక అడ్మిషన్ రిపోర్టు, ఫారం-1 రిపోర్టులు సబ్‌మిట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, కొంత సమయం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకతీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ డీవీ లలితబాబు, సెయింట్ ఆన్స్‌హైస్కూల్ ప్రతినిధి వెళాంగినిజ్యోతి, వివేకానంద స్కూల్ ప్రతినిధి శిరీష తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై గీతిక స్కూల్లో అవగాహన

పిడుగురాళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా వుండాలని కాన్పూర్ అక్షర విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రియాజాకబ్ తెలిపారు. శుక్రవారం స్థానిక గీతిక సీబీఎస్‌ఈ స్కూల్‌లో జరిగిన సీబీఎస్‌ఈ కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ప్రియాజాకబ్ రీసోర్స్‌పర్సన్‌గా హాజరై మాట్లాడుతూ సైబర్ సేఫ్టీ, సెక్యూరిటీ అనే అంశంపై స్కూల్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్‌లపై ప్రతిఒక్కరు ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా వ్యవహరించాలని, వ్యక్తిగత సమాచారాన్ని జాగ్రత్తపరుచుకోవాలన్నారు. గోళ్లమూడిపాడు నాట్కో స్కూల్ ఆఫ్ లెర్నింగ్‌కు చెందిన డాక్టర్ మదన్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ నేరాల తగ్గుదల పట్ల ఉపాధ్యాయుల పాత్రను వివరించారు. కార్యక్రమంలో గీతిక సీబీఎస్‌ఈ స్కూల్ చైర్మన్ పద్మశ్రీ బాలగంగాధరరెడ్డి, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, భవ్య స్కూల్ ఎస్ఎఫ్ఎస్, సీబీఎస్‌ఈ స్కూల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది

మరో రెండు నెలలు పొడిగింపు

సత్తెనపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారుల ఈకేవైసీ నవీకరణ గడువును ప్రభుత్వం జూన్ 30వ తేదీ వరకు పొడిగించిందని తహసీల్దార్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. తెల్ల రేషన్ కార్డు ద్వారా సరుకులు తీసుకుంటున్న వారు, ఈకేవైసీ నమోదు చేసుకోనివారు జూన్ 30వ తేదీ లోగా ఈకేవైసీ చేయించు కోవాలని ఆయన తెలిపారు. ఏప్రిల్ 30తో గడువు ముగిసినప్పటికీ బయోమెట్రిక్‌లో సాంకేతిక సమస్యలు కొనసాగటంతో ఇంకా నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఈకేవైసీ పెండింగ్ ఉండటంతో ప్రభుత్వం మరో రెండు నెలలు గడువు పొడిగించిందని ఆయన తెలిపారు. జూన్ 30వ తేదీ నాటికి ఈకేవైసీ ప్రక్రియ నూరు శాతం పూర్తి చేయటం జరుగుతుందని ఆయన తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

దాచేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి మండలంలో జరిగిన వేర్వేరు సంఘటనల్లో ఒక వివాహిత, మరొక బీటెక్ విద్యార్థి మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గురజాలకి చెందిన ఉల్లేరు దుర్గమ్మ(25)పై అనుమానంతో భర్త అప్పారావు గురువారం తలపై బలంగా మోదటంతో రక్తపు మడుగులో పడిపోయింది. క్షతగాత్రురాలిని 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మరో సంఘటనలో సత్తెనపల్లి మండలం కొమెరపూడి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి వీరపనేని వెంకట సాయిలక్ష్మణ్ దాచేపల్లి మండలం పొందుగుల శివారు పల్నాడు హాస్పటల్ సమీపంలో పురుగుమందు తాగి మృతి చెందాడు. మృతుడు కొమెరపూడి గ్రామానికి చెందిన వీరపనేని నాగేశ్వరరావు చిన్న కుమారుడు. లక్ష్మణ్ బీటెక్ పూర్తి చేసినా ఉద్యోగం లేకపోవటంతో మానసిక వేదనతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి

రాజుపాలెం, మే2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతిచెందిన సంఘటన గుంటూరు-మాచర్ల రహదారిపై మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం కల్లకుర్చి జిల్లా చిన్నసేలం మండలం ముంగ్లీల్‌పాడి గ్రామానికి చెందిన ముత్తు పాండి (25), చందిరన్ వడివేలు, రాయప్పన్ మణిమారన్‌లు ముగ్గురుకలిసి మండలంలోని కొండమోడుకు చెందిన అంకాళ్ల డేవిడ్ వద్దకు వరికోత మిషన్ తెచ్చారు. శుక్రవారం వరికోత మిషన్‌ను బెల్లంకొండ నుండి కొండమోడు తెస్తున్నారు. ఈ క్రమంలో పాండి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. మార్గమధ్యలోని చౌటపాపాయపాలెం గ్రామ సమీపంలో వెనుక వస్తున్న లారీ వేగంతో పాండిని, వరికోత మిషన్‌ను ఢీకొట్టింది. పాండి అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయలయ్యాయి. ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల భవితకు కిషోర వికాసం

పిడుగురాళ్ల, మే 2(ఆంధ్రజ్యోతి): బాలికలే లక్ష్యంగా మోసాలను కట్టడి చేయడంలో ప్రతిఒక్కరు అవగాహనతో వుండాలని గ్రేడ్-1 సూపర్‌వైజర్ ప్రసన్న, డీసీపీయూ శ్రీనివాసరావు తెలిపారు. బాలికల సమస్యలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కిషోర వికాసం కార్యక్రమాన్ని రూపొందించిందని, పిడుగురాళ్లలో శుక్రవారం బాలబాలికలకు అవగాహన కల్పించారు.

ఘనంగా కోడెల 77వ జయంతి

సత్తెనపల్లి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 77వ జయంతిని మండలంలోని గండ్లూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కోడెల చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు నలజాల కృష్ణప్రసాదు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. తాలూకా సెంటర్‌లోని డాక్టర్ కోడెల విగ్రహానికి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సయ్యద్ పెదకరిముల్లా, లాలు, పున్నయ్య నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. 5వ వార్డులో పార్టీనేత షేక్ లాలు ఇంటి వద్ద కోడెల చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు.

నిధుల కోసం సీఎం చంద్రబాబు కృషి

మాచర్లటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్ట్ నిధుల విడుదల కోసం సీఎం చంద్రబాబు కృషి చేయడం సంతోషమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో గాదె పుల్లారెడ్డి, వంగపాటి నాగరాజు, కొమ్ము కోటేశ్వరరావు, షేక్ బాబు, నాసర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

అనధికార ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలి

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో మెయిన్ రోడ్డుపై, రోడ్డుకిరువైపులా, డివైడర్లపై, రోడ్డు జంక్షన్ పాయింట్లలో అనధికారికంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు స్వచ్ఛందంగా తొలగించాలని, లేదంటే తమకు సమాచారం అందిస్తే పురపాలక సంఘం ఆధ్వర్యాన తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజా భద్రత, పబ్లిక్ ట్రాఫిక్, వాహనరద్దీ దృష్ట్యా అనధికార ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా ఉన్నాయన్నారు. పురపాలక సంఘంకు ప్రజలు సహకరించాలని కోరారు.

భూమితో తల్లిలాంటి అనుబంధం: ఏవో బ్రహ్మారెడ్డి

రెంటచింతల, మే 2(ఆంధ్రజ్యోతి): భూమితో తల్లిలాంటి అనుబంధం ప్రతి ఒక్కరికి వుంటుందని ఆ భూమి మీద చెత్తాచెదారం వేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం తుమ్మా జోజిరెడ్డి పొలంలో మట్టి నమూనాలను సేకరించారు. ఎకరా భూమిలో 8 నుంచి 10 ప్రదేశాల్లో మట్టిని సేకరించాలన్నారు. మండలానికి 748 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఒక్కో రైతు సేవా కేంద్రానికి 68 చొప్పున కేటాయించారని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.51.97 కోట్ల ఆదాయం: డీఎం

మాచర్లటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే మార్చి 31 వరకు మాచర్ల ఆర్టీసీ డిపోకు రూ.51 కోట్ల 97 లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి చెప్పారు. అమరావతి రాజధాని పనులు పునఃప్రారంభానికి వెళ్లడానికి ఏర్పాటు చేసిన బస్సులను పర్యవేక్షించేందుకు రెంటచింతల జాతీయ రహదారిలో శుక్రవారం కొద్ది సేపు విలేకరులతో మాట్లాడుతూ 2023-24 మార్చి 31 నాటికి రూ.54కోట్ల 3లక్షల ఆదాయం వచ్చిందన్నారు. మాచర్ల డిపోలో 79 బస్సులుండగా అందులో 23 అద్దె బస్సులన్నారు. ఆక్యుపెన్సీ 74 శాతం ఉందన్నారు. ఈయన వెంట అసిస్టెంట్ మేనేజర్ ఎర్రయ్య తదితరులున్నారు.

కిశోర బాలికల సమ్మర్ క్యాంపెయిన్

గురజాలటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యాన శుక్రవారం మండలంలోని అంబాపురంలో కిశోర బాలికల సమ్మర్ క్యాంపెయిన్ నిర్వహించారు. గ్రామంలోని కిశోర బాలికలకు లైంగిక భద్రత, రక్షణ, అనుకూల అభ్యాసం, ప్రభుత్వ పథకాలు, సామాజిక అవగాహనపై సూపర్‌వైజర్ అరుణశ్రీ వివరించారు. ఈ కార్యక్రమంలో బసవమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నం, విజయలక్ష్మి, ఫాతిమా, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గాలి వానకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు

నకరికల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి గాలి, వానకు చేజర్ల, కుంకులగుంట పొలాల్లో విద్యుత్‌స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సాయంత్రం 6:30గంటలకు విద్యుత్ అధికారులు మరమ్మతులు చేసినట్టు తెలిపారు. కానీ రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు. లైన్ ట్రిప్ అవుతుందని, సమస్య ఉన్న ప్రాంతాన్ని గుర్తించటం కష్టమవుతోందని విద్యుత్ అధికారులు చెపుతున్నారు. మూడు రోజుల క్రితం కూడా సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న దృష్ట్యా ఆ శాఖ అధికారులు అంతరాయాలను నివారించటంలో ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



అద్భుతంగా అమరావతి





లోకేశ్‌తో మోదీ చమత్కారం ● మోదీతో రాజధాని ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్



● సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు







సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీ బయట జనం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోందని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశా రు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధానమంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరిం చుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది.



దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



మోదీతో మంత్రి అనగాని

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మంత్రి లోకేశ్

అమరావతి పులకింత

● చంద్రబాబును ఆకాశానికి ఎత్తిన ప్రధాని మోదీ
● టెక్నాలజీ నాకంటే ముందే బాబు తీసుకువచ్చారు
● సైబరాబాద్ చూడటానికి గుజరాత్ నుంచి అధికారులను పంపించా..
● సీఎంపై పొగడ్తల వర్షం ● నాడు బొప్పూడి సభకు.. నేడు వెలగపూడి సభకు ఎంతో తేడా..

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సీఎం చంద్రబాబు నాయుడుపై ప్రశంసల జల్లు కురిపించారు. టెక్నాలజీ నేను కనిపెట్టానని చంద్రబాబు చెబుతున్నాడు కానీ వాస్తవానికి నాకంటే ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లోనే టెక్నాలజీని అభివృద్ధి చేశారని అన్నారు. తాను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన టెక్నాలజీని పరిశీలించేందుకు అధికారుల బృందాన్ని సైబరాబాద్ పంపినట్లు వెల్లడించారు. అభివృద్ధి చేయటం అంటే చంద్రబాబును చూసి నేర్చుకోవాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గురించి మోదీ మాట్లాడుతున్న సందర్భంలో ప్రజల నుండి విశేషమైన స్పందన లభించింది. మోదీ ప్రసంగంలో ఆద్యంతం చంద్రబాబు నాయుడిని ఆకాశానికి ఎత్తటం అమరావతి రైతుల మోము లో ఆనందం వెల్లివిరిసింది. ఎన్నికలకు ముందు చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి సభకు హాజరైన ప్రధాన మంత్రి అప్పుడు విపక్ష నేతగా ఉన్న చంద్రబాబు గురించి పెద్దగా మాట్లాడలేదు. చంద్రబాబు నాయుడు నాకంటే గొప్ప నాయకుడని పొడిపొడిగా ప్రస్తావించడం జరిగింది. అంతే కాదు అమరావతి అభివృద్ధి గురించి ఎటువంటి హామీ కూడా ఇవ్వలేదు. ఎన్నికలు ముగిసి చంద్రబాబు నాయుడు విశేషమైన మెజార్టీతో అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న తర్వాత మోదీ ఆయనను అవకాశం వచ్చినప్పుడల్లా పొగడ్తలతో ముంచేత్తుతున్నారు. సహజంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్న సందర్భంలో మోదీ మరి ఏ ఇతర నాయకుడు గురించి పెద్దగా ప్రస్తావించిన సందర్భాలు లేవు. అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి వచ్చిన మోదీ అందుకు భిన్నంగా ప్రవర్తించి సీఎం చంద్రబాబు నాయుడు పై ప్రశంసల వర్షాన్ని కురిపించారు. గడచిన ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురైన రాజధాని రైతులకు ప్రధాని మోదీ తన ప్రసంగం ద్వారా ఎంతో మనోధైర్యాన్ని కల్పించారు. చంద్రబాబు నాయుడిని ఆయన పొగుడుతున్న సందర్భంలో అమరావతి రైతులు భారీ ఎత్తున హర్షధ్వానాలు చేయటం కనిపించింది. త్వరలో అమరావతి పూర్తయి ఆంధ్రప్రదేశ్‌ను అధునాతన శక్తిగా మారుస్తుందని మోదీ కొనియాడటంతో భూములను త్యాగం చేసిన రైతులు పరవశించిపోయారు. మరో మూడేళ్ళలో మహా అమరావతి పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్న చంద్రబాబుకి తన భుజం కూడా కలిపి శ్రమించి దిగ్విజయం చేసేందుకు సహకరిస్తానని హామి ఇవ్వటంతో ప్రజల హర్ష ధ్వానాలతో ప్రాంగణం హోరెత్తింది.

పోలీసుల తీరు నాడు అలా.. నేడు ఇలా..

గతంలో బొప్పూడి సభ జరిగినప్పుడు పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. సాక్షాత్తు దేశ ప్రధాని హాజరైన సభ అయినప్పటికీ పోలీసులు నాటి ముఖ్యమంత్రి జగన్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన్ను మెప్పించేందుకు సభకు హాజరయ్యే జనాలకు ఎన్నో అవరోధాలు కల్పించారు. దాంతో ఆనాడు ఆ సభకు వచ్చే ప్రజలు అనేక ఇబ్బందులను చవిచూశారు. పోలీసులు సృష్టించిన అడ్డంకుల మూలంగా ప్రజలు బొప్పూడి సభా ప్రాంగణానికి చేరుకునేందుకు ఎక్కువ సమయం పట్టింది. దీంతో ప్రధాని మోదీ ప్రసంగం ముగిసే సమయానికి కూడా వేలాది మంది సభా ప్రాంగణం వైపు నడుచుకుంటూ రావటం కనిపించింది. అంతే కాదు సభా ప్రాంగణంలో తగిన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవటంతో పెద్ద ఎత్తున తొక్కిసలాట జరగ్గా నేరుగా ప్రధాన మంత్రే పలు మార్లు మైక్ తీసుకొని తోసుకోవద్దని పలు మార్లు ప్రజల్ని వారించటమే కాకుండా పోలీసు అధికారులను పదే పదే హెచ్చరించి ప్రాణాపాయం జరగకుండా చూశారు. అయితే శుక్రవారం జరిగిన ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. నాడు అడ్డంకులు సృష్టించిన పోలీసులు నేడు సభను విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించారు. వాహనాల రాకపోకలకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూశారు. ట్రాఫిక్ జామ్‌లను నియంత్రించేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాక్షాత్తు పోలీసు ఉన్నతాధికారులే నిలబడి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు శ్రమిం చారు. మండుటెండలో సైతం పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ఎంతో శ్రమించారు. ఏ మార్గంలో కూడా ట్రాఫిక్ జామ్‌లు లేక పోవటంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సభాస్థలికి బయలుదేరిన ప్రజలు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సకాలంలో ప్రాంగణానికి చేరుకోగలిగారు.

పల్నాడు జిల్లా నుంచి లక్ష మందికిపైగా..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ సభకు పల్నాడు జిల్లా నుంచి లక్ష మందికి పైగా తరలివెళ్లారు. అధికారికంగా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నేతృత్వంలో 1,100 బస్సులు ఏర్పాటు చేశారు. ఆర్టీసీతో పాటు విద్యా సంస్థల బస్సులను సమకుర్చారు. ప్రజలకు తాగు నీరు, ఆహార వసతిని కల్పించారు. జనం తరలింపును కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షించారు. అధికారికంగా ఏర్పాటు చేసిన వహనాల్లో దాదాపు 55,000 మంది తరలి వెళ్లారని జిల్లా యంత్రాంగం తెలిపింది. పజాప్రతినిధులు, జనసేన, బీజేపీ నేతలు ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేశారు. పార్టీల పరంగా దాదాపు 50 వేల మంది జన సమీకరణ చేశారు. ఇందులో పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ నేతృత్వంలో 40 వేల మంది వరకు సభకు తరలి వెళ్లారని నేతలు తెలిపారు. జన సమీకరణలో నరసరావుపేట జిల్లా నేతలు, అధికారులు విజయవంతమయ్యారు.

గుంటూరు నుంచి 1900 బస్సుల్లో..

గుంటూరు, మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు శుక్రవారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు తరలివెళ్లారు. గుంటూరు-1, 2 డిపోలతో పాటు తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల నుంచి 1,900 బస్సులను అధి కారులు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలకు ఉదయానికే బస్సులు చేరుకొన్నాయి. సభకు వెళ్లే బస్సులు ఎటువంటి లోటుపాట్లు ఉండ కుండా కండిషన్‌లో ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. సభ ముగిసిన తర్వాత సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రజల్ని వారి గమ్యస్థానాలకు చేర్చారు. సాధారణ ప్రయాణికుల కోసం 30 నుంచి 40 శాతం బస్సులు కేటాయించామని గుంటూరు జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా సిబ్బంది కేటాయించి, పర్యవేక్షించారు.

ప్రధాని సభలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్లు

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): వెలగపూడిలో శుక్రవారం జరిగిన రాజధాని పునర్నిర్మాణ సభలో కార్పొరేషన్లకు చెందిన చైర్మన్లు పాల్గొన్నారు. ఏపీబీడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సభలో పాల్గొన్నారు.



సభకు వెళుతున్న వారితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల జిల్లా నుంచి భారీగా..

(బాపట్ల, ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా నుంచి అమరావతి సభకు భారీ ఎత్తున జనం తరలి వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 380 బస్సులు శుక్రవారం ఉదయం 7 గంటలకే ఆయా పాయింట్ల వద్దకు చేరుకున్నాయి. 9 గంటలకల్లా దాదాపు అన్ని బస్సులు జనంతో రాజధాని బాటపట్టాయి. ప్రతి బస్సులో ఆశ వర్కర్, ఏఎన్ఎం, పోలీసును నియమించారు. 35 మంది సిబ్బందితో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కూడా కంట్రోల్ రూం పనిచేసింది. ఉదయం నుంచి జిల్లా కలెక్టర్ వెంకటమురళి కంట్రోల్ రూంలోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బస్సుల్లో తరలివెళ్లే ప్రజలకు మార్గమధ్యంలో నాలుగు పాయింట్ల వద్ద భోజనం అందించడానికి యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. పొన్నూరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో భోజన సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య పట్టణంలోని పలు ప్రాంతాల్లో, బాపట్లలో ఎమ్మెల్యే వేగేశన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు.





ప్రధానికి ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం

గుంటూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అమరావతి రాజధానిలోని వెలగపూడిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర గవర్నర్ మహమ్మద్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘనస్వాగతం పలికారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ప్రధానిని స్వాగతించారు. అలానే ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, ప్రత్తిపాడు శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కూడా హెలిప్యాడ్ వద్ద ప్రధానికి స్వాగతం పలికారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రధాని మోదీ హెలికాప్టర్‌లో వెలగపూడికి చేరుకొన్నారు. ఆయన ప్రయాణించిన హెలికాప్టర్‌తో పాటు కాన్వాయ్‌గా మరో రెండు హెలికాప్టర్‌లు కూడా వచ్చాయి. సెక్యూరిటీ కారణాల దృష్ట్యా హెలిప్యాడ్ వద్దకు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులెవ్వరిని ఎస్పీజీ బలగాలు అనుమతించలేదు. ప్రధాని తన వాహనంలో కూర్చుని రోడ్డుకు ఇరువైపులా తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలకు అభివాదం చేస్తూ సభా స్థలికి చేరుకొన్నారు. వేదిక వెనుక ఏర్పాటు చేసిన అమరావతి గ్యాలరీలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్‌నాయుడు, మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్ తదితరులను ప్రధాని పలకరించారు.

వర్చువల్ విధానంలోనే...

అమరావతి రాజధాని పనుల పునరుద్ధరణతో పాటు రైల్వే, జాతీయ రహదారులు, రక్షణ తదితర శాఖల అభివృద్ధి పనులన్నింటిని ప్రధాని మోదీ వర్చువల్ విధానంలోనే ఆవిష్కరించారు. సభా స్థలి వెనక 20 అడుగుల పైలాన్‌ని ఏ(అమరావతి) ఆకారంలో సీఆర్‌డీఏ, రాష్ట్ర ప్రభుత్వం కలిసి నిర్మించాయి. అయితే వివిధ కారణాల రీత్యా ఆ పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని రద్దు చేశారు. దాంతో నాగాయలంక వద్ద క్షిపణి ప్రయోగ పరీక్ష శ్రేణి, గోరంట్ల - హిందూపూర్ నాలుగు వరసల రహదారి విస్తరణ, ముద్దనూరు - బీ కొత్తపల్లి ఫోర్‌లేన్ హైవే విస్తరణ, నంద్యాల - కర్నూలు రెండు వరసల రహదారి విస్తరణ, ముదిరెడ్డిపల్లె - కడప/నెల్లూరు సరిహద్దు వరకు రెండు వరసల రహదారి విస్తరణ, ఎన్‌హెచ్-16 పరిధిలో రణస్థలం వద్ద ఆరు వరసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం, యర్రమంచి - గుడిపల్లి గ్రామాల్లో ఆర్‌వోబీ, గుంతకల్లు వెస్టు - మల్లప్ప గేట్ స్టేషన్ల మధ్య ఆర్‌వోబీ, విశాఖ పట్టణం మధురవాడలో పీఎం ఏక్తా మాల్ పనులకు వర్చువల్‌లో ప్రధాని శంకుస్థాపన చేశారు. అలానే పూర్తి అయిన జాతీయ రహదారులు, రైలు మార్గాలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు.



మోదీతో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని

ఘనంగా శంకర జయంతి

చిలకలూరిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానం ఎదురుగా ఉన్న ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శంకర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక ఉచిత ఉపనయనాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు గబ్బిటి వెంకటేశ్వరశాస్త్రి, సమితి అధ్యక్ష కార్యదర్శులు ఏకా మారుతి రామశర్మ, పోలూరి చంద్రమౌళి, కోశాధికారి పావులూరు శేషగిరి, బ్రాహ్మణ సంఘ ప్రముఖులు ఎం.శివరాం ప్రసాద్, ఎస్.రాజు నాగేశ్వరరావు, పురుషోత్తం, నాగమల్లేశ్వరరావు, వీసీహెచ్ కె.ప్రసాద్, ధూళిపాళ్ళ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

శాఖకు ఇచ్చిన డ్రోన్ పనితీరుపై
అర్బన్ సీఐ పరిశీలన

చిలకలూరిపేట, మే2 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు కేటాయించిన డ్రోన్ల పనితీరును అర్బన్ సీఐ పి.రమేష్ పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రోన్ల సాయంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్టవేయవచ్చని అన్నారు. ఇప్పటికే పోలీసుశాఖ వారు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బహిరంగంగా మద్యపానం, పేకాట, అనుమానాస్పద కార్యకలాపాల వంటి నేరాల కట్టడికి, శాంతి భద్రతల నిర్వహణకు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారని చెప్పారు. రోడ్డు ప్రమాదాల సమయాలలో ట్రాఫిక్ జామ్ అయిన ప్రాంతానికి చేరుకుని డ్రోన్ ద్వారా పరిస్థితి గమనించి ట్రాఫిక్ నియంత్రణకు వినియోగించవచ్చునని వివరించారు. డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకొనే వీలు ఉంటుందన్నారు. నేరం జరిగాక పోలీసులు వచ్చి చట్టపరమైన చర్యలు తీసుకోవడం కన్నా ముందస్తు అప్రమత్తతతో నేరాల్ని నివారించడంలో డ్రోన్లు ఉపయోగపడతాయన్నారు.

కులగణనపై
కేంద్రం నిర్ణయం హర్షణీయం

చిలకలూరిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): కులగణనతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కోరుకున్న సామాజిక న్యాయం, సమ సమాజ స్థాపన జరుగుతుందనే రాహుల్ గాంధీ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం హర్షణీయమని శుక్రవారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎం.రాధాకృష్ణ అన్నారు. సామాజిక అంతరాలు తొలగించి సత్ఫలితాలు సాధించే అవకాశం మెండుగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం కూడా ఆలస్యంగానైనా కులగణనను చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దేశంలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేదరిక వర్గాలలో అత్యధిక శాతంగా ఉన్న బలహీనవర్గాల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.

కార్మిక చట్టాలపై
న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, మే 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ పథకాలపై వ్యవసాయ మార్కెట్ ఆవరణలో న్యాయ విజ్ఞాన సమస్య నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రధాన సీనియర్ సివిల్ న్యాయాధికారి కే మధుస్వామి అసంఘటితరంగ కార్మికులకు చట్ట ప్రకారం ఉన్న సౌలభ్యాలు, హక్కులు, ఉచిత న్యాయసాయం పొందే విధివిధానాలు, ఎంప్లాయిస్ ఎంప్లాయర్ వివాద పరిష్కారాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొని సివిల్ సప్లై సంస్థ సిబ్బంది రెండో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

నాదెండ్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సలగల జయరావు(44) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులతో కలసి ఏప్రిల్ 30వ తేదీన సొంత పనులపై హైదరాబాద్ వెళ్తుండగా బస్సులో గుండెపోటుకు గురయ్యాడు. ఆయనను కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. 2009లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన జయరావు 2023లో సివిల్‌కు మారాడు. ఏప్రిల్ 2024 నుంచి నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. జయరావు అంత్యక్రియలు బాపట్ల జిల్లా కే ఉప్పరపాలెంలో శుక్రవారం జరిగాయి. ఆయన మృతికి చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బ నాయుడు, ఎస్ఐ పుల్లారావులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కిషోరి వికాసం కార్యక్రమం ప్రారంభం

శావల్యాపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): కిషోర బాలికల హక్కులు, సమస్యలపై అవగాహన కల్పించి వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కిషోరి వికాసం కార్యక్రమాన్ని మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ప్రారంభించారు. శావల్యాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం బాల్య వివాహాలను నిరోధించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని కిషోరి బాలికలతో కలసి ప్రతిజ్ఞ చేశారు. సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, బాలికలకు ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కి ఫోన్ చేయాలన్నారు. మహిళా పోలీస్ గౌస్య, అంగన్‌వాడీ టీచర్లు ఎస్తేరు రాణి, గోవిందమ్మ, గోపమ్మ, జెస్సికా, హెల్పర్‌లు వెంకటరత్నం, సుప్రియ, శివ, ఆశా వర్కర్ లీలా పాల్గొన్నారు.

● వినుకొండ: కిషోరి వికాసం కార్యక్రమాన్ని మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. సీడీపీవో అనురాధ పాల్గొని 11 నుంచి 18సంవత్సరాల వయసున్న బాలికలకు ఆరోగ్య, సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు.

దిగుబడి ఉన్నా.. ధరలేక రైతన్నల దిగాలు

● పండించిన పంటను అమ్ముకోవడానికి అవస్థలు
● అందుబాటులో లేని కొనుగోలు కేంద్రాలు
● అప్పుల ఊబిలోనే రైతన్నలు



బస్తాల్లోకి నింపిన మొక్కజొన్నలు



వరి నూర్పిడి చేస్తున్న యంత్రం

ఈపూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలను ఓర్చుకొని ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు దిగులు చెందుతున్నారు. సకాలంలో వర్షాలు పడి సాగునీరు ఉండడంతో అన్నదాతలు పంటలు సాగుచేసినప్పటికి ఉపయోగం లేకుండాపోయింది. ముఖ్యంగా వరి, మిరప, పొగాకు మొక్కజొన్న, అరటి పంటలను అధికంగా సాగుచేశారు. ఆశించిన దిగుబడులు వచ్చినప్పటికి గిట్టుబాటు ధరలేకపోవడంతో పెట్టుబడులు కూడా రాక అప్పులు రైతన్నలు అప్పుల ఊబిలోనే ఉండిపోయారు. మండలంలో 26వేల ఎకరాలలో వరి,వాణిజ్య పంటలు సాగుచేశారు. అధికంగా వరి 16వేల ఎకరాలలో సాగు చేశారు. మిర్చి 2వేలు, పొగాకు 3వేలు, కంది 15 వందలు, చెరకు, అరటి, మినుము, శనగ వంటి పంటలను సాగు చేశారు.

కల్తీ, నకిలీలతో కష్టాలు..

అన్నదాతలను కల్తీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు నిలువునా ముంచాయి. ముఖ్యంగా వరి, మొక్కజొన్న రైతులు బాగా మోసపోయారు. బయో పురుగు మందులు రైతులను కోలుకోలేని దెబ్బ తీశాయి. పురుగు మందులలో శనగపిండి, బియ్యం పిండి కల్తీచేసి విక్రయించారు. రైతులు పసిగట్టలేని విధంగా నకిలీ బయో మందులను విక్రయిస్తున్నారు. దీంతో పంటలు దిగుబడి ఉన్నా మొక్కలు ఎండిపోయాయి. ఈపూరులో విత్తన షాపు డీలర్ వద్ద రైతులు భారీగా వరి విత్తనాలు కొనుగోలు చేసి నారు పోసి నాటారు. కేళీలు రావడంతో పంట దిగుబడి తగ్గింది. డీలర్‌ను రైతులు అడగగా కొంతమందికి నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు.

గిట్టుబాటు ధరలు లేక నష్టాలపాలు

పండించిన పంటకు గిట్టుబాటు ధరలేకపోవడంతో రైతులు నష్టాలపాలయ్యారు. గత ఏడాది ధరకంటే చాలా తక్కువగా ఉండడంతో పెట్టుబడి కూడా రాలేదు. పండించిన పంటను విత్తనంతో సహా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికి అమలులో అది కన్పించడంలేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేవు. ఏదో తూతూమంత్రంగా కొనుగోలు చేయడం లక్ష్యం అయిపోయిందని చెప్పడంతో రైతులు తాము పండించిన పంటను అయినకాడికి విక్రయిస్తున్నారు. అరటి వంటి పంటలకు దగ్గరలో మార్కెటింగ్ లేక రైతులు అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నారు. అరటి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అందుబాటులో మార్కెట్ లేక గ్రామాలలో ఆటోలలో తిరిగి అమ్ముకుంటున్నారు. మిరపకు ధర లేకపోవడం, కూలీల ధర పెరగడంతో రైతులు పూర్తిగా నష్టాలలో కూరుకుపోయారు. మొక్కజొన్న దిగుబడి లేకపోవడం, కందులకు ధరలేకపోవడంతో అన్నదాతలు అప్పులు పాలవుతున్నారు. ప్రభుత్వం స్పందించి ధరలను పెంచి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



అమరావతిలో జరిగిన సభలో పాల్గొన్న ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మంత్రులు టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, తదితరులు

అమరావతి సభకు భారీగా తరలిన ప్రజలు



జెండా ఊపి అమరావతిలో జరిగే సభకు వెళ్లే బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న అచ్చుల సాంబశివరావు తదితరులు

చిలకలూరిపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మోదీ బహిరంగ సభకు శుక్రవారం చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కూటమి పార్టీల శ్రేణులు తరలి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులను తరలించేందుకు 150 బస్సులను ఏర్పాటు చేశారు. వివిధ వార్డులకు 54 బస్సులు, యడ్లపాడు మండలం నుంచి 32 బస్సులు, చిలకలూరిపేట మండలం నుంచి 42బస్సులు, నాదెండ్ల మండలం నుంచి 22 బస్సులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఏఎంజీ సంస్థకు సమీపంలో జాతీయ రహదారిపై ఈ బస్సులకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు జెండా ఊపి ప్రారంభించారు. సభకు తరలి వెళ్ళే వారికి ఎటు వంటి ఆ సౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లుచేశారు. పట్టణం నుంచి తరలివెళ్లే వారికి కోసం ఉదయం ఇక్కడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటుచేశారు. జాతీయ రహదారిపై తిమ్మాపురం యడ్లపాడు మధ్య బస్సుల్లో వెళ్లే వారికి భోజనాల ప్యాకెట్లు, టిఫిన్ ప్యాకెట్లు, మంచినీటి బాటిల్స్ అందచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, అర్బన్ సీఐ రమేష్, టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, పఠాన్ సమద్ ఖాన్, గంగా శ్రీనివాసరావు, మద్దుమాల రవి, గట్టినేని రమేష్, తుబాటి శ్రీహరి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునః నిర్మాణ పనులు ప్రారంభ సభకు నరసరావుపేట మండల టీడీపీ అధ్యక్షుడు బండారు పల్లి విశ్వేశ్వరరావు వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

● నరసరావుపేట టౌన్: అమరావతి పునఃప్రారంభం కార్యక్రమానికి జనసేన సైనికులు శుక్రవారం తరలివెళ్లారు. పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ ఆదేశాల మేరకు బస్సును ఏర్పాటు చేశారు. బస్సును రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ బెల్లంకొండ ఈశ్వర్, జనసేన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

● వినుకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): అమరావతి పునఃప్రారంభోత్సవ కార్యక్రమానికి వినుకొండ నియోజకవర్గం నుంచి శుక్రవారం భారీగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆర్టీసీ, ప్రైవేటు తరపున 107బస్సులను ఏర్పాటు చేశారు. సుమారు ఐదు వేలమందికి పైగా సభకు తరలివెళ్ళారు.



వేల్పూరు నుంచి తరలివెళుతున్న ప్రజలు

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల నుంచి అమరావతి పునఃర్నిర్మాణ సభకు ప్రజలు శుక్రవారం తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా గ్రామాలకు కేటాయించిన వాహనాల్లో వెళ్ళారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు. డ్వాక్రా మహిళలు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తరలివెళ్ళిన వారిలో ఉన్నారు.

● ఈపూరు: అమరావతిలో సభకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, తిరుమల శెట్టి బాలయ్య, అయినాల కోటేశ్వరరావు డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాలరావు, గోనుగుంట్ల శ్రీనివాసరావులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు.

● శావల్యాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పిలుపుమేరకు శావల్యాపురం మండలంలోని 11సచివాలయాల పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శుక్రవారం అమరావతిలో జరిగిన సభకు భారీగా తరలివెళ్ళారు. వీరికి ప్రభుత్వం 12 ఆర్టీసీ బస్సులు కేటాయించగా, జీవీ ఆధ్వర్యంలో మరో 4 ప్రైవేటు బస్సులు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్ళిన ప్రజలకు మార్గమధ్యలో ఎటు వంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల మౌలిక వసతులను కల్పించారు. వేల్పూరు పంచాయతీ నుంచి టీడీపీ నాయకులు బొల్లా పేరయ్య, సాదినేని కృష్ణమూర్తి దగ్గరుండి ప్రజలను బస్సుల్లో తరలించారు.

● బొల్లాపల్లి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పునఃనిర్మాణ సభకు తరలివెళ్లే వాహనాలకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. వీరికి మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లు, అల్పాహారం పార్టీ నాయకులు ఏర్పాటు చేశారు. తరలి వెళ్ళిన వారిలో కూటమి నాయకులు గోవిందు నాయక్, పెసల వెంకట నారాయణ, అర్దలపూడి శ్రీను, వక్కలగడ్డ తిరుపతిరావు నాయుడు, హనుమా నాయక్, గంగినేని రమణయ్య, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: రాజధాని పునఃర్నిర్మాణం శంకుస్థాపనకు వచ్చిన ప్రధానమంత్రి మోడీ సభకు పలు గ్రామాల నుంచి బస్సుల్లో శుక్రవారం తరలి వెళ్ళారు. గ్రామాలను బట్టి అధికారులు ఒకటి నుంచి రెండు బస్సులు వారిని తరలించేందుకు ఏర్పాటుచేశారు. మండలం నుంచి 20 బస్సుల వరకు తరలివెళ్ళాయని అధికారులు తెలిపారు.



రేకులు ఎగిరిపోవడంతో పరదా కప్పిన ఇల్లు

ఈదురు గాలుల బీభత్సం

● ఇంటిపై ఎగిరిపోయిన రేకులు ● తడిచిన పంట

వెలమావారిపాలెం (శావల్యాపురం) మే 2 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి ఇంటిపైన రేకులు లేచిపోయి ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని వెలమావారిపాలెంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెల్లవారు జామున హఠాత్తుగా కురిసిన అకాల వర్షానికి, ఈదురు గాలులకు గ్రామానికి చెందిన కాగితపు వెంకటేశ్వరరావు ఇంటిపై రేకులు ఎగిరిపోవడంతో ఇంట్లో నిల్వచేసిన 126 బస్తాల మొక్కజొన్నలు, 15 బస్తాలు మినుములు, 2 బస్తాల తవుడు, 2 బస్తాల పశువుల దాణా పూర్తిగా తడిచిపోయాయన్నారు. తడిచిపోయిన పంటల విలువ సుమారు రూ.3లక్షలువరకు ఉంటుందని బాధితులు వాపోయారు. దీనిపై ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈదురు గాలులకు చెట్టు కూలి ఆటో ధ్వంసం



దేవుడు మాన్యం కాలనీలో చెట్టువిరిగిపడి ధ్వంసమైన ఆటో

రొంపిచర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల దేవుడు మాన్యం కాలనీలో శుక్రవారం వీచిన ఈదురు గాలులకు చెట్టు విరిగి ఆటోపై పడటంతో ఆటో ధ్వంసమైంది. తెల్లవారు జామున ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడి, విద్యుత్ తీగలు తెగిపోయి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అనంతరం విద్యుత్ వైర్లను సరిచేసి సరఫరాను పునరుద్ధరించారు. పొలాల్లో మిర్చి, మొక్క జొన్న పంటలపై పరదా పట్టలను రైతులు కప్పారు. ఉదయం పూట 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న శాప్ అధికారులు, డీసీ రాఘవ

కబడ్డీ పోటీలు ప్రారంభం

వినుకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర క్రీడాశాఖ (శాప్) ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు నెలరోజులపాటు కబడ్డీ పోటీలను పట్టణంలోని కారంపూడి రోడ్డులో ఉన్న విద్యా వికాస్ స్కూల్‌లో నిర్వహించడం జరుగుతుందని కబడ్డీ కోచ్ కోమటిగుంట శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ పోటీలను డీసీ చైర్మన్ గంగినేని రాఘవరావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్, పీఈటీ రాధాకృష్ణమూర్తి, వినుకొండ జోన్ ప్రెసిడెంట్ గణపా వీరాంజనేయులు ప్రారంభించారు. కబడ్డీ కోచ్ శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ క్రీడాకారులంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మరిన్ని వివరాల కోసం 8008285430 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

డాక్టర్ కోడెల శివప్రసాద్‌కు ఘన నివాళి



కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తున్న డాక్టర్ కోడెల శివరామకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు 77వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కోడెల చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాయల సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, చింతిరాల బాలు, అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య, రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కోడెల శివప్రసాదరావు 77వ జయంతి సందర్భంగా పట్టణంలోని కోటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్టు, శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. వైద్య శిబిరానికి 526మంది హాజరయ్యారు. వారికి కంటి పరీక్షలు నిర్వహించి 168మందికి శస్త్ర చికిత్సలకు సిపార్సు చేశారు. డాక్టర్ మేఘనా, డాక్టర్ షఫేలీ వైద్య సేవలు అందజేశారు. కాగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు పలువురు రక్తదానం చేశారు. 72యూనిట్ల రక్తం సేకరించామని నిర్వాహకులు చెప్పారు. రక్తదాన శిబిరంలో డాక్టర్ కే.రామేశ్వరి, డాక్టర్ ఏడుకొండలు, నాగరాజకుమారి సేవలు అందజేశారు. చారిటబుల్ ట్రస్ట్ అధినేత, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ముందుగా ప్రారంభించారు. అవసరమైన వారికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన విద్యార్థులను, కళాశాల పీడీహెచ్ గంగాధర్‌ను అభినందించారు. రక్తదానం చేసిన మందాడి రవి మాట్లాడుతూ డాక్టర్ కోడెల శివప్రసాదరావు 77వ జయంతి సందర్భంగా తాను 77వ సారి రక్తదానం చేయటం కాకతాళీయంగా జరగటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కోడెల అభిమానులు, పాల్గొన్నారు.



డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

రావిపాడులో...

నరసరావుపేట రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసన సభాధిపతి డాక్టర్ కోడెల శివప్రసాద్ 77వ జయంతిని శుక్రవారం నరసరావుపేట మండలం రావిపాడులో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాద్ విగ్రహాలకు పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన భారీ కేక్‌ను కట్‌చేసి పంపిణీ చేశారు. నరసరావుపేట మండలంలోని పలు గ్రామాలలో డాక్టర్ కోడెల శివప్రసాద్ 77వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మెడబలిమి పాపారావు, గాలి పీటర్ జోజియ్య, మల్లవరపు అంతయ్య, నూతలపాటి కృష్ణ, కన్యధార రాజు, రెడ్డి మాస్ పౌలరాజు, పూదోట హృదయరాజు, పూదోట పాల్‌రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం రావిపాడులో కేక్ కట్‌చేస్తున్న కూటమి నాయకులు